# అంతర్మథనం

– దూరి వెంకటరావు

కడలిలో తుఫానులా కల్లోలంగా వుంది జలజ అంతరంగం.

తెల్లవారేలోగా కన్నవాళ్ళకు తన నిర్ణయాన్ని తెలపాలి. తను ఊ అంటే పెళ్ళికూతురు కాబోతోంది.

ఆ మాట కోసమే అంతా ఎదురు చూస్తున్నారు. అయితే ఆ ముక్క అనడానికి తన వ్యక్తిత్వం అడ్డు పడుతోంది. మనసు అంగీకరించడం లేదు.

● ఈవారం కథ

ఉద్యోగాలు ఆకాశ కుసుమాలు అయినప్పుడు అందుకోలేని వాళ్ళే ఎక్కువగా వుంటారు. ఇద్దరు ఒక్కరైనప్పుడు, ఒక్క ఉద్యోగంతో ఇద్దరం బతుకుదామనుకోవడం తప్పు కాదు. ఆ ఉద్యోగం వున్న ఒక్కరూ ఆడా, మగా అన్న చర్చ అప్రస్తుతం. అయితే, అందుకు సిద్ధపడినా, ఆత్మగౌరవానికి హాని కలిగితే...?

అబ్బాయి అయోగ్యుడా?

కాదు.

విద్యా విహీనుడా?

ఊహుం.

వ్యసనపరుడా?

అబ్బే.

మరెందుకు సంకోచం! పెళ్ళి మాట వింటేనే పరవశించిపోవలసిన ఆ కన్నె ఎదలో ఎందుకంత సంక్షోభం?

పడుకుందన్న మాటే గాని రెప్ప పడడం లేదు. గడచిన సంఘటనలు కళ్ళ ముందు వర్తిస్తున్నాయి.

* * *

బ్యాంకుకు బయలుదేరిన జలజ గుమ్మం వరకు వచ్చి ఆగిపోయింది.

వరండాలో పేరయ్యగారు, దశరథరామయ్య మాట్లాడుకుంటున్నారు.

"అబ్బాయి స్ఫురద్రూపి, డిగ్రీ వుంది. అమ్మా



యికి ఈడు జోడు. ఇక సాంప్రదాయమన్నారా వీనం ఎంచడానికి లేదు" కళ్ళు, చేతులు అభిన యిస్తూ చెప్పుకుపోతున్నాడు పేరయ్య.

"అది సరే పెళ్ళి కొడుకేం చేస్తున్నాడో చెప్పారు కాదు" అతడి వాక్ ప్రవాహానికి అడ్డు తగిలాడు దశరథరామయ్య.

"ఏవేవో చేయాలనే అనుకుంటున్నాడు. అయితే ఎవరూ ఏమీ చేయనివ్వడం లేదట. అలాగని ఊరుకోలేదు సుమండి. తన ప్రయత్నం తమ చేస్తూనే వున్నాడు. ఈ మధ్య ఏదో టెస్టు రాసావ న్నాడు"

"అంటే, అబ్బాయి నిరుద్యోగన్నమాట. ఆ మాట చెప్పడానికి ఇంత డొంక తిరుగుడెందుకు?" దశర థరామయ్య మాటలలో అవహేళన ధ్వనిస్తోంది.

"అయితేనేం మన అమ్మాయి ఎలాగూ ఉద్యోగం..." నచ్చజెప్పబోయాడు పేరయ్య.

"అది సరే! మీ సంబంధాల జాబితాలో నిరు ద్యోగులు తప్ప ఉద్యోగస్తులుండరా! ఎప్పుడుచూసినా అబ్బాయి యోగ్యుడు, చదూకున్నాడని అనడమే తప్ప ఫలానా పని చేస్తున్నాడని చెప్పిన పాపాన పోలేదు. మీరెన్ని చెప్పండి ఉద్యోగం సద్యోగం లేని వాడికి మా అమ్మాయినిచ్చే ప్రసక్తే లేదు"

"అలా అంటే ఎలా చెప్పండి? కనుచూపు మేరలో కనిపిస్తున్న కుర్రాళ్ళంతా ఈనాడు నిరుద్యోగులే. ఈడు మించిపోతున్నా ఉద్యోగం లేని కారణంగా అబ్బాయిలు పెళ్ళి చేసుకోమని భీష్మించుకుని కూర్చుంటే ఎదుగుతున్న అమ్మాయిలకు పెళ్ళిళ్లెలా అవుతాయ్? కాలానుగుణంగా మన ఆలోచనలు మారాలి. ఇరువురిలో ఏ ఒక్కరు ఉద్యోగం చేసినా చాలని సరిపెట్టుకోవలసిన రోజులొచ్చాయి మరి"

"చూద్దాం లెండి. అమ్మాయి ఇష్టపడాలి కదా" దాటవేశాడు దశరథరామయ్య.

అతడి పలుకుల్లో అయిష్టత కొట్టొచ్చినట్లు కన బడుతోంది.

వెళ్ళిపోయాడు పేరయ్య.

జలజ బ్యాంకు కెళ్ళి సంతకం చేసి తన సీట్లో కూర్చుంది. ఆమె మనసు ఆఫీసు పని మీద లగ్నం కావడం లేదు. పేరయ్య చెప్పిన సంబంధం చుట్టూ పరిభ్రమిస్తోంది. తండ్రి తనవో పెద్ద ఉద్యోగస్తు డికిచ్చి పెళ్లి చేయాలని ఉబలాట పడుతున్నాడు. తన అదృష్టమేమిటో మరి వచ్చే సంబంధాలలో ఎక్కువమంది నిరుద్యోగులే కనిపిస్తున్నారు. పేర య్యగారన్నట్టు కాలంతోపాటు మన దృక్పథంలో కూడా మార్పు రావాలేమో? భార్యాభర్తలలో ఏ ఒక్కరు సంపాదించినా సంసారం గడవకపోదు. అటువంటప్పుడు నిరుద్యోగైనా యోగ్యుడైనటువంటి వాణ్ణి చేపడితే నష్టమేముంది?

పెళ్ళికొడుకు గురించి పేరయ్యగారి నడిగి వివ రాలు సేకరించింది.

పార్కులో అతడు ఒంటరిగా వుండడం చూసి దగ్గరకెళ్ళింది

"హలో, నమస్తే. మీరు ప్రవీణ్ కదూ?"

ఓ అందాల అపరిచిత యువతి ఆకస్మిక పలకరిం పుకు ఉలిక్కిపడ్డాడు ప్రవీణ్. ఔనన్నట్లు తలూపాడు కాస్సేపటికి తేరుకుని.

"నా పేరు జలజ" గిటారులా ఖంగున మ్రోగిం దామె కంఠం.

"గ్లాడ్ టు సీ యు. కూర్చోండి" ప్రక్కకు జరి



గాడు ప్రవీణ్.

బొమ్మలా చతికిలబడింది జలజ.

కళ్ళని జిగేల్ మనిపించే అందంతో కుంకుమ రంగు చీరలో ముగ్ధమనోహరంగా వుందామె. పాల మరుగుతో పోటీపడుతున్నట్లుగా వున్న శరీరపు రంగు... మత్తుగా గమ్మత్తుగా సోలిపోతున్న ట్లుండే అరమోడ్పు కళ్ళు... తేనె ధారలు కురిపి స్తున్నట్టుగా మెరుస్తున్న ఎర్రటి పెదాలు, అన్నిటిని మించి సూదిగా గుండెల్లోకి బాణాలు విడుస్తు న్నట్లున్న ఆమె ఎత్తైన గుండెల్ని చూసి తియ్యగా మూలిగిందతడి మనసు.

"పేరయ్యగారు మీ గురించి నాన్నగారితో మాట్లా డారు. రేపో నేడో పెళ్ళిచూపులు జరగొచ్చు."

జలజ మాటలకు మనసు తొందర చేస్తున్నా నిగ్రహించుకుంటూ "నాకింకా ఉద్యోగం.." ఏదో అనబోయాడు.

"అవకపోయినా పరవాలేదు. నేను జాబ్ చేస్తు న్నాను" అందామె అతడి మాట పూర్తి కాకుండానే.

"అది సరే ముందుగా నన్ను మీరు..."

"కలుసుకోవడం వల్ల పరస్పరం అభిప్రాయాలు వెల్లడి చేసుకోడానికి వీలౌతుంది."

మాట్లాడలేదు ప్రవీణ్.

"వరకట్నాల మీద మీ అభిప్రాయం" అడిగింది జలజ.

పగలబడి నవ్వాడు ప్రవీణ్.

అతడి నవ్వుకు అర్థం తెలియక అయోమయంగా చూసింది జలజ.

"అది నా ఉద్దేశంలో అనాగరిక సాంప్రదాయం" నవ్వుతూనే జవాబిచ్చాడు ప్రవీణ్.

"పెళ్ళంటే మీ ఉద్దేశం"

"రెండు పవిత్ర హృదయాల కలయిక"

అంతే, అతడి మనసు తెలిసిపోయిందామెకు. అతడి ఆలోచనలు ఆమెకు నచ్చాయి. అతని అభిరుచులు ఆమెను ఆకట్టుకున్నాయి.

ఆరోజు రాత్రి భోజనాల దగ్గర జలజ పెళ్ళి ప్రసక్తి రానే వచ్చింది.

పేరయ్యగారు చెప్పిన సంబంధం మీద భర్త అభి ప్రాయం అడిగింది అరవింద.

"డబ్బుకు కక్కుర్తిపడి అన్నీ ఇటువంటి పనికిమా లిన సంబంధాలే పట్టుకొస్తాడు పేరయ్య. వయస్సు మీరిన నిరుద్యోగులు కొందరు ఉద్యోగం చేస్తున్న పిల్ల దొరికితే చాలనుకుంటారు. ఆమె ఆదాయం మీద బ్రతికేద్దామని వాళ్ళ ఆశ. అటువంటి వాళ్ళకు చచ్చినా నా బిడ్డనివ్వను" ఖండితంగా చెప్పాడు దశరథరామయ్య.

"మీ మాటల్ని బట్టి చూస్తే మన దేశంలో నిరు ద్యోగం ఎంత తీవ్ర స్థాయికి చేరుకుందో అర్థమవు తుంది. సానుభూతితో ఆలోచించండి. సంబంధం మంచిదైనప్పుడు వరుడు నిరుద్యోగైతేనేం?" అన్నది జలజ వారి సంభాషణలో జోక్యం చేసుకుంటూ.

కూతురి మాటలేమాత్రం రుచించలేదు దశరథ రామయ్యకి. అయితే వివేకం, విజ్ఞానం అన్నీ వున్న జలజ ఆ సంబంధమే చేసుకుంటానని పట్టుబట్ట డంతో ఆమె అభిప్రాయానికి తల ఒగ్గక తప్పలేదు.

పేరయ్య ఆధ్వర్యంలో పెళ్ళిచూపులు, నచ్చుకో వడాలు అన్నీ క్షణాల మీద జరిగిపోయాయి.

దశరథరామయ్య మరి నోరు మెదపలేదు.

మాఘం ప్రవేశించడంతో ముహూర్తం మూడు మాసాలు ముందుకు జరిగింది.

రెండు నెలల తర్వాత పెళ్ళి వారి వద్ద మరొక ఉత్తరం వచ్చింది. ఆ లేఖ చదివిన నాటి నుండి ఎంతో హుషారుగా కనిపిస్తున్నాడు దశరథరామయ్య.

ప్రవీణ్‌కి ఉద్యోగమయిందని, వేలకు వేలు కట్న మిస్తామంటూ ఆడపిల్ల తండ్రులు పోటీపడుతు న్నారని, పిల్లవాడు నచ్చుకున్న కారణంగా మొదటి అవకాశం జలజకే ఇవ్వడం ఉచితమని భావించి ఉత్తరం రాస్తున్నామని, ఆ స్థాయి కెదిగి పెళ్ళి చేయగలిగితే తమ కెటువంటి అభ్యంతరం వుండ బోదని, లేని పక్షంలో మరో సంబంధం చూసుకో వలసి వుంటుందన్నది ఆ లేఖ సారాంశం.

కాబోయే అల్లుడిప్పుడు ఉద్యోగస్తుడయ్యాడని తెలిసి సంబరపడిపోయాడు దశరథరామయ్య. అంతవరకు ఆ సంబంధం మీద వున్న ఏహ్య భావం మంచులా కరిగిపోయింది.

ఇక జలజ విషయానికొస్తే, ఆమెకు ప్రవీణ్‌పై ఆ క్షణం వరకు వున్న సానుభూతి పటా పంచలైంది. అతడు ఆదర్శాలు వల్లించాడు. జాబ్ దొరకగానే వాటిని గాలికి వదిలేసాడు. అవకాశాన్ని బట్టి అభిప్రాయాలు మార్చుకోగల వ్యక్తితో తన జీవితాన్ని ముడివేసుకోడానికి ఆమె మనస్సు ఒప్పుకోవడం లేదు.

ఆ మాటే తల్లితో అంటే "నీకు వచ్చిన సంబంధమే కదే. కాకుంటే ఇప్పుడు కట్నం అడిగాడు. అంతేకదా. ఆ విషయం నాన్నగారు చూసుకుంటార్లే" తేలిగ్గా తీసిపారేసింది అరవింద.

"అదికాదమ్మా" ఏదో అనబోయింది జలజ.

"చాల్లే. నీ పెళ్ళి కోసం నాన్నగారు చెప్పులరిగేలా తిరగడం తప్పినందుకు సంతోషించు" కూతురు నోరు నొక్కేసింది అరవింద.

తల్లి మాటలు జలజకు అంతులేని మనస్తాపాన్ని కలిగించాయి. రెండు మాసాల క్రితం ఎవ్వరికీ ఇష్టంలేని ఆ సంబంధం తనకెంతగానో నచ్చింది. ఇప్పుడందరూ మొగ్గు చూపిస్తున్న ఆ సంబంధమే తన విముఖతకు కారణమైంది. దానికి కట్నం ఒక్కటే కారణం కాదు. కట్నం పుచ్చుకోని వ్యక్తినే చేసుకుంటానని తను ఏనాడూ అనలేదు. అయితే తనకిక్కడ జరిగింది మోసం. వంచన. వ్యక్తిత్వాన్ని చంపుకుని ఒక అవకాశవాదిని కట్టుకోడానికి తన మనసు అంగీకరించడం లేదు.

తన నిర్ణయాన్ని తండ్రితో కుండబద్దలు కొట్టినట్టు చెప్పింది.

"అంతా నిశ్చయమయ్యాక, ప్రవీణ్ నీకు కాబోయే భర్తని అందరికీ తెలిసాక, ఇప్పుడు కాదనుకుంటే నీకు పెళ్ళి అవడం ఒక సమస్య అయిపోతుంది. నేను పది మందిలో తలెత్తుకుని తిరగలేను. వాళ్ళడిగింది కట్నం. అదివ్వడానికి నేను సిద్ధంగా వున్నప్పుడు నీ కొచ్చిన అభ్యంతరమేమిట"ని ఎదురు ప్రశ్న వేసాడు దశరథరామయ్య.

మాట్లాడలేదు జలజ.

దశరథరామయ్య లాంటి తండ్రులున్నంతకాలం మన సమాజంలో వరకట్న దురాచారం నశించిపోతుందనుకోవడం ఎండమావి లాంటిదేనని ఆమెకు అనిపించింది.

ముభావంగా వుంటున్న బిడ్డను చూసి "చూడమ్మా, ఇది నువ్వు ఇష్టపడ్డ సంబంధం. కారణం లేకుండా కాదనుకుంటున్నావు. ఈ రాత్రి బాగా ఆలోచించుకుని రేపు నీ నిర్ణయం తెలియపరచు. అది ఏదైనా పరవాలేదు" కూతురు తల మీద ఆప్యాయంగా నిమురుతూ హామీ ఇచ్చాడు దశరథరామయ్య.

* * *

జలజకు ఆ రాత్రి పరీక్షా సమయం.

కన్నవారి అభిప్రాయానికి అనుగుణంగా మనసు లుకుందామని ఎంత ప్రయత్నించినా మనస్సు నెనక్కి లాగుతోంది. ప్రవీణ్ మనస్తత్వం ఆమెకేమాత్రం నచ్చడం లేదు. డబ్బు కోసం నిశ్చయమైన సంబంధాన్ని త్రెంచుకోవడానికి సిద్ధపడ్డాడు. ఉద్యోగం లేకపోయినా అతడి మంచితనం మీద వున్న నమ్మకంతో జీవితాంతం అతడిని పోషించడానికి సిద్ధపడి పెళ్ళి చేసుకోవాలనుకుంది. కాని ఇప్పుడు?... ఆమె ఆలోచనలు తెగడం లేదు. రాత్రి రెండవ ఝాము వరకు ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చింది. దాంతో గుండెల మీద నుండి బండరాయి తీసేసినట్లు ఎంతో ఉపశమనాన్ని పొందింది. అంతే, నిద్రలోకి జారుకుంది. లేచేసరికి బారెడు ప్రొద్దెక్కింది.

బాతురూముకెళ్ళి కాలకృత్యాలు ముగించుకుని బయటకొచ్చిన జలజకు కాఫీ అందించింది తల్లి అరవింద.


'నీ నిర్ణయమేమిటన్నట్లు' పేపరు మడిచి జలజ వంక చూసాడు దశరథరామయ్య.

"జీవితాంతం కన్నెగా మిగిలిపోవడానికైనా సిద్ధమే. ప్రవీణ్‌ని మాత్రం పెళ్ళాడేది లేదు" అంటూ తన గదిలోకెళ్ళిపోయింది జలజ.


CLEAN, HEALTHY AND PURE WATER.

RAMA WATER FILTER

The choice of housewives for over 10 years!




AVAILABLE AT ALL LEADING STORES

Trust Rama to help you maintain good health all through.

RAMA'S SUPERIOR FEATURES

★ Only water filter made from - 100% SALEM Stainless Steel Sheets.
★ Plasma welding technology for rust and leak proofing.
★ Compact, unique double action filter candle.
★ Available in 17, 24, 34 and 45 ltrs.
★ 10 years guarantee.

Every genuine original Rama water filter has an embossed logo of the brand.

Insist on original Rama water filter.

RAMA®

Original SALEM Stainless Steel Water Filter

ULKA 50223